# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభాల నివారణకు భారత్ - నెదర్లాండ్స్ కలిసి పని చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- డెంగ్యూ నివారణపై అవగాహన పెంచడానికి పౌరులందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కేంద్రమంత్రి జే పీ నడ్డా పిలుపునిచ్చారు.

- మాదక ద్రవ్యాల రహిత భారతదేశం సాధించేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో నీతి ఆయోగ్ బృందం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది.

- కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

======================

ప్రపంచ సంక్షోభాల నివారణకు భారత్-నెదర్లాండ్స్ కలిసి పని చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌లోని "ది హేగ్" నగరంలో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. విశ్వసనీయమైన, పారదర్శకమైన, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఉండే సప్లయ్ చైన్ నిర్మించేందుకు భారత్ - నెదర్లాండ్స్ కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రపంచం.. కోవిడ్, అంతర్జాతీయ యుద్ధాలు, తీవ్రమవుతున్న ఇంధన సంక్షోభం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఈ సవాళ్లను సకాలంలో పరిష్కరించకపోతే.. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి తిరోగమనం చెందుతుందన్నారు. దాంతో జనాభాలో ఎక్కువ భాగం మళ్లీ పేదరికంలోకి నెట్టబడే ప్రమాదం ఉందని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

అదే విధంగా డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉందని ప్రధానమంత్రి అన్నారు. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయని, భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయని వెల్లడించారు. భారతదేశంలో సెమీ కండక్టర్ ప్లాంట్ల ఏర్పాటు జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని చోట్ల మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయని తెలిపారు. ఏఐ సమ్మిట్, జీ-20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగామని చెప్పారు. 21వ శతాబ్దంలో సాంకేతికత, మానవీయ విలువల కలయికతో సాగుతున్న భారతదేశం.. ప్రపంచానికి ఒక అపారమైన `అవకాశాల భూమి`గా అవతరించిందని ప్రధాని పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

డెంగ్యూ నివారణపై అవగాహన పెంచడానికి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి పౌరులందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జే పీ నడ్డా పిలుపునిచ్చారు. ఈ రోజు జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి స్పందిస్తూ... పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం, పరీక్షల సామర్థ్యాన్ని విస్తరించడం, చికిత్స సౌకర్యాలను మెరుగుపరచడం, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా డెంగ్యూ నియంత్రణకు ప్రభుత్వం తన ప్రయత్నాలను నిరంతరం ముమ్మరం చేస్తోందని పేర్కొన్నారు. డెంగ్యూపై జరిగే ఈ పోరాటంలో సమాజంలోని ప్రతి ఒక్కరి క్రియాశీలక భాగస్వామ్యం ఎంతో అత్యవసరమని జే పీ నడ్డా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మాదక ద్రవ్యాల రహిత భారతదేశం సాధించేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. భారతదేశ దర్యాప్తు సంస్థలు `ఆపరేషన్ రేజ్‌పిల్` ద్వారా దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా 182 కోట్ల రూపాయల విలువైన "క్యాప్టగాన్" (Captagon) డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ సమాచారాన్ని పంచుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా... పశ్చిమాసియా దేశాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ఈ డ్రగ్స్ రవాణా ఉదంతాన్ని ముందుగా పసిగట్టడం, అలాగే ఒక విదేశీ పౌరుడిని అరెస్ట్ చేయడం... డ్రగ్స్‌పై భారత దేశానికి ఉన్న "జీరో టాలరెన్స్" విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత భూభాగాన్ని రవాణా మార్గంగా వాడుకుంటూ.. దేశంలోకి ప్రవేశించే లేదా దేశం దాటి వెళ్లే డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని అమిత్ షా స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ (NEET) పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న పి.వి. కులకర్ణి, మరో నిందితురాలు మనీషా వాఘ్మరేలను ఢిల్లీ కోర్టు దర్యాప్తు నిమిత్తం 10 రోజుల పాటు సిబిఐ (CBI) కస్టడీకి అప్పగించింది. ఈ కేసును లోతుగా ద్యర్యాప్తు చేయాల్సి ఉందని, విచారణకు వీరిద్దరినీ దేశ రాజధాని ఢిల్లీ దాటించి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి ఉందని దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది. దీనిని పరిశీలించిన ప్రత్యేక సిబిఐ కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా నిందితులకు సిబిఐ రిమాండ్ విధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో నీతి ఆయోగ్ (NITI Aayog) బృందం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ మేరకు నీతి ఆయోగ్ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర-రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, పశ్చిమ బెంగాల్ లో సహకార సమాఖ్య స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లడంపై నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం ఈ సమావేశాన్ని నిర్వహించింది. నీతి ఆయోగ్ అడిషనల్ సెక్రటరీ రోహిత్ కుమార్, ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ సేన్ ఈ సమావేశానికి నాయకత్వం వహించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రణాళిక గణాంకాల శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ పి.కె. మిశ్రాతో పాటు 9 మందికి పైగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. `స్టేట్ సపోర్ట్ మిషన్`, `అస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్ ప్రోగ్రామ్`, `అటల్ ఇన్నోవేషన్ మిషన్` రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చే నీతి ఆయోగ్ యొక్క ఇతర ముఖ్యమైన కార్యక్రమాలను ఈ సమావేశంలో సమీక్షించినట్లు నీతి ఆయోగ్ ఆ ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) 12వ తరగతి ఫలితాలు ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో మార్కుల పునఃపరిశీలన, రీ-ఎవాల్యుయేషన్ కు నోటీసు జారీ చేసింది. తమ ఫలితాల పట్ల సంతృప్తి చెందని విద్యార్థులు రెండు అంచెల సమీక్షా విధానాన్ని ఉపయోగించుకోవచ్చని బోర్డు ఆ నోటీసులో పేర్కొంది. విద్యార్థులు మూల్యాంకనం చేసిన జవాబు పత్రాల స్కాన్డ్ కాపీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది. జవాబు పత్రాలలో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వాటి పరిశీలన కోసం లేదా బోర్డు మార్కింగ్ విధానం ఆధారంగా నిర్దిష్ట సమాధానాలను తిరిగి మూల్యాంకనం చేయాలని విద్యార్థులు కోరవచ్చునని తెలిపింది. స్కాన్ చేసిన కాపీల కొరకు ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇందుకు ఒక సబ్జెక్టుకు 700 రూపాయల రుసుము చెల్లించాల్సి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. పునః పరిశీలన, రీ-ఎవాల్యుయేషన్ దరఖాస్తులని ఈ నెల 26 నుండి 29వ తేదీల మధ్య సమర్పించాలని CBSE తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ రోజు సిక్కిం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రాష్ట్ర ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధామంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. సిక్కిం అద్భుతమైన నైసర్గిక అందాలు, సంపన్న సాంస్కృతిక వారసత్వం, పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధత ఆ రాష్ట్రాన్ని దేశానికే పర్యావరణ హితమైన సుస్థిర అభివృద్ధికి ఒక మార్గదర్శిగా నిలిపాయని రాష్ట్రపతి కొనియాడారు. భారతదేశ అభివృద్ధిలో సిక్కిం అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని ప్రధామంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. రాబోయే కాలంలో కూడా సిక్కిం అభివృద్ధి, ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వం తన పూర్తి మద్దతును నిరంతరం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన గుజరాత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా 10 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టానికి 116 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్.. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించడం తక్షణమే నిలిపివేయాలని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన “సేనా సంవాద్" కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా స్పష్టం చేశారు. పాకిస్తాన్.. భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాద చర్యలను తక్షణమే విరమించాలని లేని పక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు దక్షిణ బంగాళాఖాతంలోని కొన్ని భాగాలు, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవులలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం IMD స్పష్టం చేసింది. రాగల రెండు రోజుల్లో కేరళం, మాహె, దక్షిణ కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్, ఈశాన్య భారత ప్రాంతాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = =